# Key Area 4 : Building & leading teams

## ప్రధాన రంగం : బృంద నిర్మాణం – నాయకత్వం

**మాడ్యూల్ పేరు** : సానుకూల పాఠశాల సంస్కృతిని పెంపొందించడం (Developing Positive School Culture)

**సబ్ యూనిట్లు** : పరిచయం, 2.0 పాఠశాల సంస్కృతి,
2.1 పాఠశాల సంస్కృతి రకాలు,
2.2 సానుకూల పాఠశాల సంస్కృతి ప్రాధాన్యత

**రచయిత** : శ్రీ సాయి ప్రమోద్ బతేన,
Co-founder & Director,
Alo Kit Education Leadership Pvt. Ltd.,

అనువాదం : శ్రీ పి. అశోక్,
ప్రధానోపాధ్యాయుడు,
ZPHS – కూర,
అదిలాబాద్ జిల్లా.

# సానుకూల పాఠశాల సంస్కృతిని పెంపొందించడం

**లక్ష్యాలు :**

**ఈ మాడ్యూల్ పూర్తి అయిన తర్వాత మీరు...**

1) బృంద సంస్కృతిని నిర్వచిస్తారు.

2) పాఠశాలల్లో బృంద సంస్కృతిని ఏర్పరచు కారకాలను వివరిస్తారు.

3) బృంద సంస్కృతిని నిరోధించు కారకాలను అవగాహన చేసుకుంటారు.

4) బృంద సంస్కృతిని పెంపొందించు వ్యూహాలను వివరిస్తారు.

**ముఖ్యమైన పదాలు**

బృంద పని, ధనాత్మక పాఠశాల సంస్కృతి, విషపూరిత పాఠశాల సంస్కృతి, సహకారం, ప్రేరణ.

## 1.0 పరిచయం

''ప్రతి ఒక్కరు కలిసి ముందుకు వెళ్తున్నప్పుడు, విజయం సాధించడమనేది దానికదే జరుగుతుంది''. ఇది అమెరికాకు చెందిన అత్యంత విజయవంతమైన పారిశ్రామికవేత్త, ఫోర్డు మోటార్ కంపెని స్థాపకుడైన హెన్రీ ఫోర్డు అన్నమాట. ఈ వాక్యం బృందపని యొక్క అన్ని పార్శ్వాలను సంక్షిప్తంగా వివరిస్తుంది. ప్రపంచంలోని వివిధ రంగాలలో విజయం సాధించిన నాయకుల నుంచి మనం తెలుసుకునేదేమంటే మనం చేసే ఏ గట్టి ప్రయత్నంలోనైనా విజయానికి బృందపనే ప్రధాన భూమిక పోషిస్తుంది.

బృందపని అనగా ఒక ఉమ్మడి లక్ష్యసాధనకు ఒక సమూహం యొక్క సహకారయుత ప్రయత్నం లేదా చేయవలసిన పనిని సమర్థవంతంగాను, ప్రయోజనకరరీతిలో పూర్తిచేయడం. ఏ సంస్థ యొక్క నాయకునికైనా బృంద నిర్మాణం మరియు నాయకత్వం వహించడమనేది ఒక సంక్లిష్టమైన పనిగానే మనమందరం అంగీకరిస్తుంటాం. ఈ విషయం పాఠశాల నాయకులకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే వారు పాఠశాలకు నాయకులు మరియు చాలా సందర్భాలలో వారు పెద్ద సంఖ్యలో గల ఉపాధ్యాయులకు బోధనేతర సిబ్బందికి మరియు పాఠశాల యాజమాన్య కమిటి సభ్యులకు నాయకత్వం వహించవలసి ఉంటుంది.

సమర్థవంతమైన బృందాలను మరియు శక్తివంతమైన బృందపనిని అభివృద్ధి చేయడం పాఠశాల నాయకులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది వారి పాత్రలో విజయం సాధించడానికి ప్రధానమైన పాత్రను పోషిస్తుంది. సమర్థవంతమైన బృందాలను నిర్మించడం ద్వారా పాఠశాల నాయకులు పొందు కొన్ని ముఖ్యమైన ప్రయోజనాలను కింద పొందుపరచడమైనది.

1) సిబ్బంది మధ్య సకారాత్మక సంబంధాలు వృద్ధిచెందును.

2) సిబ్బంది చేయుపనిలో ఉత్పాదకత పెరుగును.

3) సిబ్బంది అంతా ఉమ్మడి లక్ష్య సాధనలో ఎల్లప్పుడూ నిమగ్నమై ఉండడానికి ప్రేరణ కలిగిస్తుంది.

4) సిబ్బందిలో సమస్యాసాధన సామర్థ్యాలు, సృజనాత్మకతను పెంపొందించును.

*మీరు ప్రతిస్పందించే అంశాలు*

- బృందపని వల్ల ఏయే ప్రయోజనాలు కలుగుతాయని మీరు భావిస్తున్నారు?
- సమర్థవంతమైన బృంద నిర్మాణం మరియు నాయకత్వానికి దోహదం చేయు కారకాలేవని మీరు భావిస్తున్నారు?

బృంద నిర్మాణం సమర్థవంతంగా ఉండడానికి దోహదం చేయు కారకాల గురించి తెలుసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. సంస్థాగత ప్రవర్తన రీతిపై పనిచేసిన ప్రముఖుడైన జె. రిచర్డు హాక్‌మన్ దీనికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను వెలికితీశాడు. అదేమంటే బృంద సభ్యుల మధ్య సహకారమనేది వారి వ్యక్తిత్వాలు, వైఖరులు లేదా ప్రవర్తనారీతులపై ఆధారపడి ఉండకపోవడమే. ఇదికాకుండా బృందాలు వృద్ధి చెందడానికి దానికి తోడ్పడు కొన్ని అనుకూల పరిస్థితులనేవి అవసరం. ఇలాంటి బృంద నిర్మాణం, నాయకత్వానికి గల అనుకూల పరిస్థితులలో ముఖ్యమైనది బృంద సంస్కృతి ఒకటి. కానీ ఎంతో ముఖ్యమైన ఈ బృంద సంస్కృతిని గురించి సంస్థ నాయకులు సరైన శ్రద్ధవహించకపోవడం, తద్వారా బృంద నిర్మాణంలో విఫలం కావడంతోపాటు, బృందం తన అస్థిత్వాన్ని కూడా కోల్పోతుంది. మనం పాఠశాల పరంగా చూస్తే ఈ పాఠశాల సంస్కృతి అనేది సమర్థవంతమైన బృందాలను అభివృద్ధి చేయడంలో ఒక సంక్లిష్టమైన కారకంగా పనిచేస్తుంది.

ఈ మాడ్యూల్‌లో మనం పాఠశాల సంస్కృతి గురించి, వివిధ రకాల పాఠశాల సంస్కృతులు మరియు బృంద పనిపై దాని ప్రభావం, సమర్థవంతమైన బృంద నిర్మాణానికి దోహదం చేయడానికి, సకారాత్మక పాఠశాల సంస్కృతికి అవసరమైన వ్యూహాల గురించి శోధించే ప్రయత్నం చేద్దాం.

## 2.0 పాఠశాల సంస్కృతి

కింది చిత్రంలో చూపినట్టి బంజరు భూమిలో సేంద్రియ కూరగాయలు మీరు పండించాలని ఊహించుకో. అక్కడ సరైన మట్టిలేదు, సరాసరి ఉష్ణోగ్రత $50^{\circ}C$ మరియు పొడి వాతావరణం ఉంది. ఏమగును? మీరు సేంద్రియ కూరగాయుల పండించగలుగుతారా?

ఇక చిత్రం–2లో చూపిన విధంగా సారవంతమైన భూమి మీకు ఉంది. ఇక్కడ సారవంతమైన నేల, మంచి అనుకూలమైన ఉష్ణోగ్రత మరియు అనుకున్నంత వర్షపాతం ఉంది. ఇప్పుడు ఏమగును? ఈ భూమిలో మీరు సేంద్రీయ కూరగాయలు పండిరచగలుగుతారా?



చిత్రం–1 : బంజరు భూమి పొడి వాతావరణం గలది.



చిత్రం–2 : సారవంతమైన భూమి మంచి వర్షపాతం గలది.

ఇప్పుడు మీరు కూరగాయలను పండించేబదులు, మీరు ఒక వృత్తి నిపుణునిగా మీ ఆలోచనలతోపాటు మరియు తమకు తామే స్వయంగా వృద్ధి చెందాలని మీరు భావిస్తారు. మీరు ఒక పాఠశాలలో పనిచేస్తున్నారని భావించండి. ఆ పాఠశాల సంస్కృతి ఎలా ఉందంటే దాని నాయకులు / ప్రిన్సిపాల్ సిబ్బందిపై అరుస్తారు, సిబ్బంది మధ్య తరచుగా విభేదాలుంటూ, ఎవరైనా తమ నూతన ఆలోచనలను అమలుచేయాలనుకున్నప్పుడు ఎగతాళి చేయడం లేదా హాస్యమాడడం జరుగుతుంది. ఇలాంటి పాఠశాలలో మీరు బృందంగా పనిచేయాలనుకున్నప్పుడు మీ వృద్ధి, మీ ఆలోచనలు, ప్రేరణ ఏమవుతుంది?

పై రెండు ఉదాహరణల ద్వారా బృంద నిర్మాణంలో ఒక ముఖ్య కారకంగా పాఠశాల సంస్కృతి యొక్క ప్రాధాన్యత గురించి మీరు ఆలోచించడం ప్రారంభించే ఉంటారు. పాఠశాల సంస్కృతిని అభివృద్ధి చేయడంలోను, మెరుగుపరచడంలోను పాఠశాల నాయకులు కీలక భూమిక పోషిస్తారు. అందుకొరకే పాఠశాల సంస్కృతికి సంబంధించిన వివిధ అంశాలను పాఠశాల నాయకులు పరీక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది. మనం ఈ చర్చలో మరింత ముందుకు వెళ్లే ముందుగా, మనం పాఠశాల సంస్కృతి అంటే ఏమిటో నిర్వచిద్దాం.

ఫుల్లాన్ ప్రకారం, పాఠశాల సంస్కృతి అనగా పాఠశాల పనిచేసే విధానంలో మార్గదర్శకంగా ప్రతిబింబించే విలువలు మరియు నమ్మకాలు అంటే, పాఠశాల నాయకుడు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు ఒకరితో మరొకరు ప్రవర్తించుతీరు, వారు నమ్మకాలు, విలువలు, ఆకాంక్షలు ఒకరితో మరొకరు పంచుకునే తీరునే పాఠశాల సంస్కృతిగా చెప్పవచ్చును.

## 2.1 పాఠశాల సంస్కృతి – రకాలు

పాఠశాలలోగల వ్యక్తుల వైఖరులు, ప్రవర్తనల ఆధారంగా రెండు రకాల పాఠశాల సంస్కృతులుంటాయి. అవి :

1) సానుకూల పాఠశాల సంస్కృతి

2) విషపూరిత పాఠశాల సంస్కృతి

సానుకూల పాఠశాల సంస్కృతి అనేది వ్యక్తులు తగిన విలువ, గౌరవం ప్రేరణ ఉన్నదని భావించునట్టి మరియు సిబ్బంది వృత్తిపరంగాను, వ్యక్తిగతంగాను అభివృద్ధిచెందుటకు అవకాశం కలిగినట్టి ప్రవర్తనలు, వైఖరులు, విలువలు గల పాఠశాల. దీనికి విరుద్ధమైనది విషపూరిత పాఠశాల సంస్కృతి. ఇది వ్యక్తులు విసుగు, అగౌరవం, ప్రేరణరహితమైనదని భావన కలిగించు ప్రవర్తనలు, వైఖరులు, విలువలుగల పాఠశాల. ఈ రెండు రకాలైన పాఠశాల సంస్కృతులు కూడా సిబ్బంది బృందంలో పనిచేయు సామర్థ్యం, ఉద్దేశాన్ని ప్రభావ పరుచును. సానుకూల పాఠశాల సంస్కృతి వ్యక్తులు బృందాలలో పనిచేయడం ద్వారా సంతోషాన్ని ఆస్వాదిస్తే, విషపూరిత సంస్కృతి అనేది వ్యక్తులు బృందాలలో పనిచేయడాన్ని నిరుత్సాహపరుస్తుంది.

*మీరు ప్రతిస్పందించే అంశాలు*

- మీరు సానుకూల లేదా విషపూరిత సంస్కృతి గల పాఠశాలల్లో దేనిలో పనిచేయడానికి ఇష్టపడుతారు? ఎందుకు?
- ఎలాంటి, పాఠశాలల్లో విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి పనిచేయడానికి మరియు పాఠశాల అభివృద్ధికి సహకరించడానికి ఇష్టపడుతారు? ఎందుకు?

3) ఏ రకమైన పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన బాగుంటుందని మీరు భావిస్తున్నారు?

4) వ్యక్తుల యొక్క ఏ విధమైన పనులు మరియు వైఖరులు సానుకూల పాఠశాల సంస్కృతి, విషపూరిత పాఠశాల సంస్కృతి ఏర్పడడానికి దోహదపడును?


## 2.2 సానుకూల పాఠశాల సంస్కృతి – ప్రాధాన్యత

మనుషులందరూ కలిసిమెలిసి ఉండాల్సిన అవసరముంది, అలాగే సామాజిక పరమైన భావన కలిగి ఉండాలి. మనమందరమూ ఏమని భావించాలంటే మనం ఇందులో భాగమని మరియు సమాజ బాగుకొరకు తమవంతు దోహదపడుతున్నామని భావించాలి. పరిశోధనలు ఏం చెబుతాయంటే ఎప్పుడైతే ఉపాధ్యాయులు, విద్యార్థులు సామాజిక చైతన్యం కలిగి ఉంటారో అప్పుడు వారు జరిగిన పనిపట్ల చాలా సంతృప్తిని పొందడం, పాఠశాలకు హాజరుకావడానికి ఇష్టపడడం, చేస్తున్న పనిలో సంతృప్తి పొందడం మరియు హర్షించదగ్గ ఫలితాలు పొందడం జరిగుతుంది. పాఠశాల సంస్కృతి ఎప్పుడైతే బలాలు, సహకారం, ఉత్పత్తి, భావప్రసరణ, సంబంధాలు, అభివృద్ధి మరియు దయాగుణంపై ఎక్కువ దృష్టి సారిస్తుందో అక్కడ పనిచేయు వ్యక్తులు విజయవంతం కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే అలాంటిచోట పనిచేయు వ్యక్తులు తమకున్న ప్రాముఖ్యత, ప్రోత్సాహాలపట్ల మంచి భావన కలిగిఉండి పోటీతత్వం, నిస్సహాయత వంటి అనుభూతులు కలిగి ఉండరు. పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తాము ఎలాగైతే కరుణ, సద్భావన, విలువలను పొందుతున్నారో, తాము ఇతరులతో వ్యవహరించునప్పుడు కూడా అదేవిధమైన విలువలను, గౌరవాన్ని ఇచ్చే అవకాశముంటుంది. ఇంకా చెప్పాంటే ఎవరైతే వ్యక్తులు విలువలు, నమ్మకాలు, ఉన్నత ప్రమాణాలు మరియు ఆచార వ్యవహారాలు కలిగి ఉంటారో వారు సాఫల్యత, బాధ్యతల విషయంలోను వ్యక్తిగతంగాను, భాగస్వామ్యంలోను సుసంపన్నతను కలిగి ఉంటారు. వీటన్నింటిపైన మరొక అంశం ఉంది. అదేంటంటే పాఠశాల అనే ఒకేఒక్కచోట మాత్రమే వ్యక్తులు ఒక సుస్థిర స్థానంగాను, తగిన మద్దతు ఉన్న స్థలంగా అనుభూతిపొందుతాడు. పాఠశాల సంస్కృతి విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల ప్రవర్తన, అనుభూతి, ఆలోచనలు ఎలా ఉంటాయో నిర్ధారిస్తుంది. సానుకూల పాఠశాల సంస్కృతి అనేది వ్యక్తులు కొన్ని అంశాలపై దృష్టికేంద్రీకరించునట్లు, నిబద్ధతను కలిగియుండునట్లు, ప్రేరణను పెంచునట్లు, వ్యక్తులు తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి, తన సమర్థతను పెంపొందించుకునేటట్లు మార్గదర్శనం చేస్తుంది. అందువలననే పాఠశాల నాయకులు పాఠశాలలో సురక్షితమైన, సంరక్షణయుతమైన, బాధ్యతాయుతమైన సానుకూల పాఠశాల సంస్కృతిని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంటారు. తద్వారా వ్యక్తులు తమ జీవితాంతం కూడా విజయవంతం కావడానికి తగిన అవకాశాలు కల్పించబడుతుంది. సానుకూల పాఠశాల సంస్కృతి అనేది

విద్యార్థులలో తగిన అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ప్రముఖంగా దోహదపడును. ఈ సానుకూల పాఠశాల సంస్కృతి అనేది పాఠశాల సిబ్బందిలో బాధ్యత నిర్వహణలో భాగస్వామ్య భావనలను చొప్పించునట్లుచేసి, విద్యార్థుల అభ్యసనను మెరుగుపరుచునట్లు మరియు వారు చేసే ప్రయత్నంలో ముందంజవేసి విద్యార్థులందరికీ తగిన విధంగా సహాయపడడానికి దోహదం చేయును.

## 2.3 సానుకూల పాఠశాల సంస్కృతి – అంశాలు

పాఠశాల సంస్కృతి అనేది ఒక రోజులో ఏర్పడేది కాదు. అది ఏర్పడడానికి కొంత సమయం పట్టడమేగాకుండా అది వివిధ అంశాల కలయికగా ఉంటుంది. ఇందులోని ప్రతి అంశం పాఠశాల సంస్కృతి అభివృద్ధి కావడానికి వివిధ కాలవ్యవధులలో దోహదపడును. కింద చిత్రం పాఠశాల సంస్కృతిలోని నాలుగు ముఖ్యమైన అంశాలను చూపుతుంది.




**ప్రశంసా సంస్కృతి** : ప్రశంసా సంస్కృతి అనేది ప్రతి వ్యక్తి భిన్నమైన వ్యక్తిగా, విభిన్న బలాలతో ఉన్న వ్యక్తిగా గుర్తిస్తుంది మరియు వారి అభివృద్ధికి అవకాశం ఉండే వాతావరణాన్ని ఏర్పరుస్తుంది.

1) **బలాలను ఆదరించడం** : పాఠశాలలోని ప్రతి వ్యక్తి ఇతర వ్యక్తుల బలాలను గుర్తించడం మరియు అంగీకరించడం జరుగుతుంది మరియు దీనిని ఒక సాధనంగా పరస్పరం ఒకరికొకరు లాభం చేకూర్చుకోవడానికి ఉపయోగిస్తారు.
2) **సమతుల్య పరిపుష్టి ఇవ్వడం** : జరిగిన తప్పును అభ్యసన సోపానాలుగా పరిగణించడం మరియు అభివృద్ధి కొరకు సరైన పరిపుష్టి ఇవ్వబడును.

**కృత్యం–1** : మీరు పాఠశాలల్లో గమనించు కొన్ని ప్రవర్తనారీతులు కింద ఇవ్వబడినాయి. అవి ప్రశంసించే లేదా నోటి దురుసును ప్రస్ఫుటించే సంస్కృతులలో వేటికి సంబంధించినవో గుర్తించండి.

- తప్పును ప్రతిసారి ఎత్తి చూపుతారు.
- ప్రతి ఒక్కరి యొక్క చిన్న చిన్న విజయాలను గుర్తించి, చప్పట్లు, చిన్నపాటి బహుమతులు, ప్రశంసాపూర్వక సర్టిఫికెట్లు, పురస్కారం అందించడం ద్వారా అభినందిస్తారు.

- మంచి పనులను ప్రశంసించకపోవడం లేదా గుర్తింపునివ్వకపోవడం.
- మంచి పనులు మరియు కృషిని గుర్తించి మిగతా అందరికీ దానిని కథలు, ప్రదర్శన రూపంలో చేరవేస్తారు.
- తన కింద పనిచేయు సిబ్బందిపై అరవడం సాధారణంగా జరుగుతూనే ఉంటుంది.
- వ్యతిరేక భావనతో ఎప్పుడూ ఒకరకమైన ఆందోళనకర వాతావరణం ఉండడం.
- సానుకూలమైన మరియు ప్రశాంతమైన వాతావరణం ఉండడం.
- సిబ్బంది బలాలు, వారి పురోభివృద్ధిని గమనిస్తూ సమతుల్యమైన పరిపుష్టిని అందించడం.

**సంబంధాలను పెంచిపోషించు సంస్కృతి** : సంబంధాలను పెంచిపోషించు సంస్కృతి ఉన్నచోట ప్రతి ఒక్కరు ఇతరులపట్ల తగిన శ్రద్ధవహిస్తారు. ఉపాధ్యాయులు తమ విద్యార్థులు, వారి తలిలదండ్రుల పట్ల నిజమైన శ్రద్ధవహిస్తారు. పాఠశాల సిబ్బంది ఒకరిపట్ల మరొకరు శ్రద్ధ తీసుకుంటూ, ఇబ్బందులలో మరియు సంతోష సమయంలో కూడా ఒకరినొకరు మద్దతుగా నిబడతారు. అది ఒక పాఠశాల ఎక్కడైతే :

1) **ఇతరులతో అనుభవాలు పంచుకొనే అవకాశం** : ప్రతి ఒక్కరు బహిరంగంగా ఒకరికి సంబంధించిన విషయాలు, వారి కుటుంబ సంబంధిత విషయాలు, వారి ఇబ్బందులు, వారి విజయాలు మరొకరితో పంచుకోవడం, వినడం జరుగుతుంది. వ్యక్తులను యథాతదంగా ఉన్నది ఉన్నట్లుగా అంగీకరిస్తారు.

2) **కలిసి పనిచేయడానికి అవకాశం** : ప్రతి ఒక్కరు ఇతరులతో కలిసి పనిచేయడానికి జట్టులో అవకాశముంటుంది. ఉపాధ్యాయులు కలిసి పనిచేయడానికి జట్టులో అవకాశముంటుంది. ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తారు మరియు సహకరించుకుంటారు. విద్యార్థులు జతలుగాను, సమూహాలలోను కలిసి తమ తరగతి పనిని పూర్తిచేస్తారు. కొన్ని వారాలు, మాసాలు, సంవత్సరాలుగా కలిసి పనిచేయడానికి తగిన అవకాశం మరియు సమయం ఉంటుంది.

3) **ఒక్కొక్కరితో మాట్లాడడానికి అవకాశం** : పాఠశాల నాయకులు తమ ఉపాధ్యాయులు ఎలాంటి అనుభూతి పొందుతున్నారు మరియు ఎలా పనిచేస్తున్నారని తెలుసుకోవడానికి ఒక్కొక్కరితో విడివిడిగా తరచుగా మాట్లాడడం జరగాలి. పాఠశాల నాయకులు పిల్లలతో, వారి గురించి ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులతో తరచుగా సంభాషిస్తుండాలి. ఇలా ఒక్కొక్కరితో విడిగా మాట్లాడడం వలన దీర్ఘకాలికంగా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడడానికి, సహకారాన్ని పెంపొందించడానికి దోహదపడును.

**కృత్యం-2** : మీరు పాఠశాలల్లో గమనించు కొన్ని ప్రవర్తనారీతులు కింద ఇవ్వబడినాయి. ఇవి సంబంధాలు పెంచిపోషించడానికి లేదా బేధాభిప్రాయాలు ఏర్పడడానికి ఉపయోగపడునా గుర్తించండి.

- ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏ నేపథ్యం నుండి వస్తున్నారో తెలుసుకోవడానికి తల్లిదండ్రుల ఇళ్ళను సందర్శిస్తారు.
- ఉపాధ్యాయులు ఒకరి తరగతి గదిని మరొకరు సందర్శించరు, మరొకరి పనిలో ఎలాంటి ఆసక్తి చూపరు.
- పాఠశాల నాయకుడు అప్పుడప్పుడు ఉపాధ్యాయుల తరగతి గదులను సందర్శిస్తారు మరియు తరగతి గదిలో కూర్చుంటారు.
- ఉపాధ్యాయులు తమ ఆలోచనలు, భావనలను పంచుకోవడానికి తరచుగా కలుస్తుంటారు.
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల్లో తల్లిదండ్రుల హాజరుశాతం చాలా తక్కువ.
- ఉపాధ్యాయులు పాఠశాలకు ఆలస్యంగా వస్తుంటారు మరియు తరచుగా గైర్హాజరవుతారు.
- ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సంబంధం కేవలం పనివరకు మాత్రమే పరిమితం. అంతకుమించి గాఢమైన సంబంధాలేమీ ఏర్పడవు.

**శారీరక మరియు భావోద్వేగపర భద్రతగల సంస్కృతి** : ఇలాంటి పాఠశాల సంస్కృతిలో సంబంధీకులందరూ (ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు) శారీరకంగాను, భావోద్వేగపరంగాను భద్రంగా ఉన్నామని భావన కలిగి ఉంటారు. ఈ పాఠశాలల్లో

1) **పాఠశాల నిర్వహణ** : పాఠశాల ఆవరణ అంతా విద్యార్థులు గానీ లేదా ఇతరులుగానీ గాయపడకుండా ఉండే విధంగా సరైన విధంగా ఉండాలి. ఒక సమయాన గాయాలేమైనా ఏర్పడితే ప్రథమ చికిత్స సదుపాయం పాఠశాలలో ఉండాలి. అలాగే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్ళే అవకాశాలుండాలి.

2) **బెదిరింపు లేవు** : పాఠశాల ఎలాంటి బెదిరింపుకు అవకాశం లేని వాతావరణం ఏర్పరుస్తుంది. ఏవైనా కొట్లాడటం, మానసికహింసకు గురిచేసే సందర్భాలు వస్తే వాటిని వెంటనే పరిష్కరించబడును.

3) **శారీరక లేదా మానసిక వేధింపు లేవు** : పాఠశాలలో ప్రతి ఒక్కరికి భద్రత ఉంటుంది. విద్యార్థులు లేదా పెద్దలపై ఎలాంటి శారీరక, మానసిక వేధింపు ఉండవు. పాఠశాలకు రావడానికి, తిరిగి ఇంటికి వెళ్ళడానికి ప్రతి ఒక్కరు భద్రంగానే ఉన్నామనే భావనతో ఉంటారు. ఏవైనా శారీరక, మానసిక వేధింపుల సంఘటనలు దృష్టికి వస్తే, వెంటనే సరైన చర్యలు గైకొనబడును.

4) **ప్రతి ఒక్కరు తమ ఆలోచనలు లేక భావోద్వేగాలు వెల్లడించడానికి భద్రత** : పాఠశాలలో ప్రతి ఒక్కరు తమ ఆలోచలను, భావోద్వేగాలను వ్యక్తం చేయడానికి తగిన స్వేచ్ఛ ఉంటుంది.

**కృత్యం–3 :** మీరు పాఠశాలల్లో గమనించు కొన్ని ప్రవర్తనారీతులు కింద ఇవ్వబడినాయి. అవి శారీరక, మానసిక, భావోద్వేగ భద్రత లేదా అభద్రత పెంచే సంస్కృతిని పెంపొందిస్తుందేమో గుర్తించండి.

- ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలు, ఆలోచనలు, మానసిక సంఘర్షణలు ఇతరులతో పంచుకోవడానికి తగిన స్వేచ్ఛ ఉంటుంది.
- వ్యక్తులను తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తంచేయమన్నప్పుడు నిశ్శబ్దంగా ఉంటారు.
- కొంత మంది సిబ్బంది ఇంతర సిబ్బందిని శారీరకంగాను, మానసికంగాను హింసిస్తారు కానీ ఎలాంటి చర్యలు తీసుకొనబడవు.
- వేధింపు లేక కొట్లాటలకు సంబంధించిన కేసులపట్ల శ్రద్ధవహిస్తూ, ప్రేమపూర్వకంగాను, నిష్పాక్షికంగా పరిష్కరిస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి ఉండని వాతావరణం ఏర్పరచడం.
- విద్యార్థులు తమ జీవిత అనుభవాలు, ఆసక్తుల గురించి పంచుకోవడానికి ప్రత్యేక అవకాశాలుంటాయి.
- విద్యార్థులు ఒకరినొకరు ఎల్లప్పుడూ వేధించుకోవడం, తద్వారా విద్యార్థులు బడిమానివేయడం జరుగును.
- పాఠశాల ఆవరణలో విద్యార్థులందరూ భద్రతాభావం కలిగిఉండి, పాఠశాల నిర్లక్ష్యం కారణంగా శారీరక హింస కేసులు ఒక్కటి కూడా నమోదు కాదు.

**నిరంతర అభ్యసన సంస్కృతి :** పాఠశాలలోని ప్రతి భాగస్వామి (విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుడు) అభ్యసనలో నిరంతరంగా భాగస్వామ్యం పొంది, ప్రతి ఒక్కరు ఇతరుల అభివృద్ధికి సహాయపడును. ఇలాంటి పాఠశాలల్లో కింది విషయాలు మనకు కనిపిస్తాయి.

1) **వృత్తిపర నిరంతర అభివృద్ధి :** సిబ్బంది తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి నిరంతరంగా శిక్షణలు ఉంటాయి.

2) **నవకల్పనలు :** తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియలో పురోగమనం కొరకు, పాఠశాలకు చెందిన ఇతర సమస్యల సాధనకు నవకల్పనలు చేస్తుంటారు.

**కృత్యం–4 :** మీరు పాఠశాలల్లో గమనించు కొన్ని ప్రవర్తనారీతులు కింద ఇవ్వబడినాయి. అవి నిరంతర అభ్యసన సంస్కృతికి లేదా నిలుపుదలకు ఉపయోగపడునో గుర్తించండి.

- ఉపాధ్యాయులు అభ్యసన సమూహాలు ఏర్పరుస్తారు. అక్కడ వారు ఇతరులకు తాము ఎందులోనైతే ప్రావీణ్యత కలిగి ఉన్నారో వాటిని ఇతరులకు బోధిస్తారు.
- ఉపాధ్యాయులు తమకు తెలిసింది మాత్రమే బోధిస్తారు, కొత్త బోధనా విధానాలను ఎప్పుడో ఒకప్పుడు గానీ ప్రయత్నించరు.

- ఉపాధ్యాయులు బ్లాగు (blogs) రాస్తారు. కాన్ఫరెన్సుకు హాజరవుతారు, కొత్తఆలోచనలను స్వచ్ఛందంగా, స్వయంగా ప్రయత్నిస్తారు.
- ఉపాధ్యాయులు తమ సహచరుల తరగతులలో కూర్చుంటారు, తద్వారా వారి బోధనావ్యూహాలను తెలుసుకుంటారు.
- ఉపాధ్యాయులు తాము రాసిన విద్యావిషయక అంశాలను, మంచి బోధనాభ్యసన వ్యూహాలను ఒకరితో మరొకరు మార్చుకోవడంగానీ, పంచుకోవడంగానీ చేయరు.
- తల్లిదండ్రులకు వివిధ విషయాలకు చెందిన ప్రాథమిక అంశాలను బోధిస్తారు. వీరు నేర్చుకున్న అంశాల ద్వారా విద్యార్థులకు అభ్యసనలో సహాయపడును.
- ప్రతి పనిని నిక్కచ్చిగా చేయాలనే దానిపై కేంద్రీకరిస్తారు. అందువలన తప్పులను విమర్శిస్తుంటారు.


3) **బృంద సంస్కృతిని పెంపొందించుటకు వ్యూహాలు** : బృంద సంస్కృతిని పెంపొందించడమనేది దానికదే జరిగేదేమీకాదు. దీనికొరకు పాఠశాల నాయకుడు వివిధ రకాల వ్యూహాలను రూపొందించి, నిరంతరంగా అమలుచేయవలసి ఉంది. మనమిప్పుడు సానుకూల పాఠశాల సంస్కృతిని పెంపొందించు కొన్ని వ్యూహాలను ఇక్కడ చర్చిద్దాం.

1. పాఠశాలలోని ప్రతి భాగస్వామి తనను అభినందించు వాతావరణం ఉందని భావనను కలిగి ఉండడమనేది సానుకూల పాఠశాల సంస్కృతిని ఏర్పరచు ప్రధాన అంశం. విద్యార్థులు తయారుచేసిన సృజనాత్మక పనులను తరగతుల్లో, పాఠశాల ఆవరణల్లో ప్రదర్శించడం, ఉపాధ్యాయలకు, తల్లిదండ్రులకు బహుమతుల అవార్డులు అనేవి చాలా సురళమైన ఆలోచనలు.




2. విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు తమ విజయాలను, తాము ఎదుర్కొన్న సవాళ్ళను పంచుకోవడానికి ప్రత్యేకంగా విద్యార్థి వలయాలు (Student sharing circles), ఉపాధ్యాయల వలయాలు (Teachers sharing circles) ఉంటాయి. వీటిలో అందరూ వారానికి లేదా మాసానికి ఒకసారి కలుసుకుంటారు. ప్రతి ఒక్కరు ఇతరులను అవగాహన చేసుకోవడానికి ఇది ఒక మంచి అవకాశంగా ఉపయోగపడును.


పాఠశాల భద్రత సర్వే, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు, భావనలు తెలుసుకోవడానికి వారి నుండి తీసుకునే పరిపుష్టి పాఠశాల నాయకులకు బాగా ఉపయోగపడును. సర్వే కేవలం వృత్తిపర అంశాలేగాకుండా, వ్యక్తిగత పురోగతి, సవాళ్ళను తెలుసుకునే విధంగా రూపొందించబడును. ఈ విధంగా సేకరించిన సమాచారాన్ని పాఠశాలలో భద్రతాపూర్వక వాతావరణం ఏర్పరచడానికి తద్వారా ప్రతి ఒక్కరూ ఉద్వేగపర భద్రతను పొందడానికి ఉపయోగించాలి.



వలయాలు




పాఠశాల భద్రత సర్వే



భాగస్వాముల పరిపుష్టి

(Sharing cirles) (School safety survey ) (Stateholder Feedback)

3. విద్యార్థుల ఇళ్ళను సందర్శించడం ద్వారా వారి కుటుంబ నేపథ్యం తెలుసుకునే అవకాశం కలగడమే గాకుండా, తల్లిదండ్రులకు పాఠశాలపై ఒకరకమైన నమ్మకం కలుగుతుంది. పాఠశాల నాయకులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఒక్కొక్కరిగా మాట్లాడేవిధంగా సమయాన్ని కేటాయించుకోవాలి. దీని ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల నుండి ఏం కోరుకుంటున్నారు, దానికి పాఠశాల ఏ విధంగా దోహదపడుతుందో తెలిసే అవకాశం ఉంటుంది. చివరగా చెప్పేదేమంటే తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులందరి సహకారంతో పాఠశాల మొత్తానికి కొన్ని ఉత్సవాలు, కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ విధంగా చేపట్టిన కార్యక్రమాలన్నింటి ద్వారా వ్యక్తుల మధ్య బంధాలను ఏర్పరచడానికి, బలపరచడానికి దీర్ఘకాలంలో ఉపయోగకరంగా ఉంటుంది.



ఇళ్ళ సందర్శన



పాఠశాల ఉత్సవాలు మరియు మేళాలు




ఒక్కొక్కరితో సమావేశం

## సారాంశం :

బృంద పనిని ప్రోత్సహించడమనేది పాఠశాల నాయకులు చేయవలసిన పనులన్నింటిలోను ముఖ్యమైనది. పాఠశాల నాయకుడు తన విధి నిర్వహణలో విజయం సాధించడానికి బృంద పనిని ప్రోత్సహించడమనేది ముఖ్య భూమిక నిర్వహిస్తుంది. కానీ దీనికొరకు చాలా ఆలోచించవలసి ఉండడమేగాకుండా మంచి ప్రణాళిక కూడా అవసరం. పాఠశాల సంస్కృతి, పాఠశాల దార్శనికత మరియు లక్ష్యాలు అనే అంశాలు పాఠశాలలోని భాగస్వాములందరూ ఒక బృందంగా పనిచేయడానికి చాలా ముఖ్యమైన భూమిక పోషిస్తాయి. ఈ మాడ్యూల్‌లో

మనం చర్చించినట్లుగా మొదటగా పాఠశాల నాయకుడు ప్రస్తుత పాఠశాల సంస్కృతిపై ఒక అంచనాకు వచ్చి, ఆ తర్వాత సానుకూల పాఠశాల సంస్కృతి ఏర్పరచడానికి తగిన వ్యూహాలు రూపొందించాలి. థియోడర్ రూజ్‌వెల్ట్ చెప్పినట్టు "గొప్పవైనవేవీ సులభంగా రావు" అనగా సానుకూల పాఠశాల సంస్కృతి వృద్ధిచేయడానికి కొంత సమయం అవసరం అలాగే పాఠశాల నాయకులు, ఇతర సభ్యులు కష్టంతో కూడిన ప్రయత్నాలు దీనికై చేయవలసి ఉంది. ఒకసారి ఈ సంస్కృతి ఏర్పడితే, సమర్ధవంతమైన బృందపనికి అది దారి తీయును.

## రిఫరెన్సులు


1) Cobb, N. (2014). Climate, culture and collaboration : The key to creating safe and supportive schools. Techniques : Connecting Education & Careers, 89 (7), 14–19.

2) Flannery, K. B., Frank, J. L., Kato, M. M., Doren, B., & Fenning, P. (2013). Implementing schoolwide positive behavior support in high school settings : Analysis of eight high schools. High School Jouran, 96(4), 267–282.

3) Gruenert, S., & Whitaker, T. (2015). School culture rewired : How to define, assess, and transform it. Alexandria, VA : ASCD.

4) Sara Confeld (2016). The importance of a Positive School Culture. Master's thesis, Adler Graduate School.

5) Martine Haas and Mark Mortensen. The Secrets of Great Teamwork. Harvard Business Review.

*మీరు నేర్చుకున్నదేమిటి?*

- పాఠశాలల్లో బృంద నిర్మాణం, నాయకత్వం ఏర్పడడంలో పాఠశాల సంస్కృతి ఎలాంటి పాత్రవహించదు.

  (సత్యం / అసత్యం)

- ప్రశంసించు సంస్కృతి అనేది సానుకూల పాఠశాల సంస్కృతి అభివృద్ధి చేయడంలోను తద్వారా బృంద నిర్మాణానికి దోహదపడును. (సత్యం / అసత్యం)

- తప్పులను ఎంచడం మరియు చాలా తీవ్రమైన విమర్శనాత్మక పరిపుష్టిలు సానుకూల సంస్కృతికి దారితీయును. (సత్యం / అసత్యం)

- భావోద్వేగ మరియు శారీరక భద్రతకు పాఠశాలలో భరోసాను ఇవ్వడమనేది సానుకూల పాఠశాల సంస్కృతి అభివృద్ధి చేయడంలో ఒక అంశం కాదు. (సత్యం / అసత్యం)

- సానుకూల పాఠశాల సంస్కృతి ఏర్పరచడంలో పాఠశాల నాయకులకు ఎలాంటి పాత్ర లేదు.

  (సత్యం / అసత్యం)

- విషపూరిత సంస్కృతిని తొలగించడంలో పాఠశాల నాయకులు కీలక పాత్ర పోషించవచ్చును.

  (సత్యం / అసత్యం)